ప్రభాత
# ఉదయం
తెలుగు దినపత్రిక

## రిపోర్టర్లు కావలెను
అత్యంత ప్రజాదరణ పొందిన ప్రభాత ఉదయం
తెలుగు దినపత్రికలో పనిచేయుటకు తెలంగాణ వ్యాప్తంగా
జిల్లా, మండల మరియు నియోజకవర్గాల వారీగా
రిపోర్టర్లు కావలెను.
ప్రభాత ఉదయం తెలుగు దినపత్రిక
సంప్రదించండి
ఫోన్: 93910 89608

సంపుటి: 2 | సంచిక: 315 | పేజీలు: 4 | వెల: రూ.3/- | శుక్రవారం 21 ఫిబ్రవరి 2025 | ఎడిటర్: ఎం.దామోదర్ రెడ్డి




# ఎన్నిక ఏదైనా విజయం మనదే

## ఎన్‌డిఎ పక్ష సమావేశంలో ప్రధాని మోడీ.. ఎన్‌డిఎ నేతలకు బిజెపి మధ్యాహ్న విందు



**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 20 (ప్రభాత ఉదయం):** ఎన్నిక ఏదైనా ఇక ఎన్‌డిఎదే విజయమని, ఎక్కడా తగ్గేది లేదని ప్రధాని మోడీ స్పష్టం చేశారు. బెంగాల్ కావచ్చు, బీహార్ కావచ్చు, కేరళ అయినా విజయం తమ కూటమిదేనని ధీమా వ్యక్తం చేశారు. ఢిల్లీ ముఖ్యమంత్రి రేఖాగుప్తా ప్రమాణ స్వీకారం ముగిసిన తర్వాత ఢిల్లీలో ఎన్డీయే పక్షాల సీఎంలు, డిప్యూటీ సీఎంల సమావేశం జరిగింది. అలాగే బీజేపీ ఎన్డీయే నేతలకు ప్రత్యేక విందు ఏర్పాటుచేసింది. ఈ సమావేశంలో ప్రధాని మోదీ, అమిత్ షా, బీజేపీ జాతీయ అధ్యక్షులు నడ్డా హాజరయ్యారు. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ కూడా ఈ సమావేశానికి హాజరయ్యారు. అలాగే ఎన్డీయే పాలిత రాష్ట్రాల ముఖ్యమంత్రులు, ఉప ముఖ్యమంత్రులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. ఉత్తరప్రదేశ్ రాష్ట్ర బడ్జెట్ ప్రవేశపెట్టడంతో ఆ రాష్ట్ర సీఎం యోగి ఆదిత్యనాథ్ ఢిల్లీ సీఎం ప్రమాణ స్వీకారానికి, ఎన్డీయే పక్షాల సీఎంల సమావేశానికి హాజరుకాలేదు. ఈ సమావేశంలో ప్రభుత్వాల పనితీరు ప్రధాని మోదీ అడిగి తెలుసుకున్నట్లు తెలుస్తోంది. ఢిల్లీ సీఎం రేఖాగుప్తా, డిప్యూటీ సీఎం పర్వేష్ సాహెబ్ సింగ్ కూడా ఈ సమావేశంలో పాల్గొన్నారు. కొత్తగా సీఎం, డిప్యూటీ సీఎం బాధ్యతలు చేపట్టిన ఈ ఇద్దరినీ ఎన్డీయే పక్షాల సీఎంలు, డిప్యూటీ సీఎంలు అభినందించారు. ఆ తర్వాత బీజేపీ జాతీయ అధ్యక్షులు నడ్డా, ప్రధాని మోదీ మాట్లాడారు. అభివృద్ధి అజెండాపై ఈ సమావేశంలో చర్చించినట్లు సమాచారం. అయితే మోడీ ఎక్స్‌లో కూడా ఇదే పోస్ట్ చేసారు. ఇక ఎన్నిక ఏదైనా తమదే విజయమని అన్నారు. ఎన్డీయే సమావేశంలో చంద్రబాబు, పవన్ కళ్యాణ్‌తో ప్రధాని మోదీ ప్రత్యేకంగా

..మిగతా 2లో




## యూనివర్సిటీలపై
# కేంద్రం కుట్రలు

## కలసి పోరాడుదామని భట్టి పిలుపు

**తిరువనంతపురం, ఫిబ్రవరి 20 (ప్రభాత ఉదయం):** యూనివర్శిటీలపై కేంద్రం కుట్రలపై కలిసి పోరాడుదామని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు.. కేరళ తిరువనంతపురంలోని జాతీయ ఉన్నత విద్యా సమ్మేళనంలో పాల్గొన్న ఆయన.. విద్యావ్యవస్థను ఢిల్లీ నుంచి రిమోట్ కంట్రోల్ ద్వారా నడపలేరని మండిపడ్డారు. రాష్ట్రాల అవసరాలకు అనుగుణంగా విధానాలను రూపొందించాలన్నారు. విద్యా, ఆరోగ్య రంగాల్లో రాష్ట్రాల నిర్ణయాలను కేంద్రం గౌరవించాలన్నారు. రాష్ట్రాలు పరిపాలన విభాగాలే కాదు..దేశ పురోగతికి జీవనాడులని భట్టి విక్రమార్క అన్నారు. కేంద్రం యూనివర్శిటీల్లో రాష్ట్రాల పాత్రను తొలగించాలని చూస్తోంది. నియామకాల నుంచి అడ్మిషన్ల వరకు రాష్ట్రాలకు హక్కు లేకుండా చేసే కుట్ర చేస్తోంది. ప్రజలకు వ్యవస్థలకు సరిపోయే విద్యాసంస్థలను రాష్ట్రాలే నిర్మించుకుంటాయి. ఒక రాష్ట్రానికి మరొక రాష్ట్రానికి పోలిక ఉండదు. సొంత నిర్ణయాలు లేకుండా నాణ్యమైన విద్యను ఏ రాష్ట్రం అందించలేదు. రాష్ట్రాలు ఒక ఉమ్మడి లక్ష్యంతో ఐక్యమైనపుడు కేంద్రం తప్పక వినాలి. ఒక రాష్ట్ర విద్యార్థుల నాడి ఆ రాష్ట్రానికి తెలుస్తుంది అని భట్టి అన్నారు.

# ప్రజాప్రతినిధుల కోర్టుకు హాజరైన రేవంత్ రెడ్డి

**హైదరాబాద్, ఫిబ్రవరి 20 (ప్రభాత ఉదయం):** నాంపల్లిలోని ప్రజాప్రతినిధుల కోర్టుకు సీఎం రేవంత్‌రెడ్డి హాజరయ్యారు. ఎన్నికల ప్రచార సమయంలో రేవంత్‌రెడ్డిపై నల్గొండ టూటౌన్ పోలీస్ స్టేషన్‌లో, బేగంబజార్ పీఎస్‌లో, మెదక్ జిల్లా కౌడిపల్లి పీఎస్ పరిధిలో మొత్తం మూడు కేసులు నమోదయ్యాయి. ఈ కేసుల విచారణ నిమిత్తం ఆయన కోర్టుకు హాజరయ్యారు. రేవంత్‌రెడ్డి ప్రతిపక్ష నేతగా ఉన్నప్పుడు.. భారాస ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగా కేసులు నమోదు చేసిందని టీపీసీసీ లీగల్‌సెల్ వైస్ చైర్మన్ తిరుపతి వర్మ తెలిపారు. తదుపరి విచారణను ప్రజాప్రతినిధుల కోర్టు మార్చి 23కి వాయిదా వేసింది.






## హైడ్రాను మరింత
# పటిష్టం చేయాలి

### భూ కబ్జాదారుల ఆటకట్టిస్తున్న హైడ్రా
### విలేకరుల సమావేశంలో శివారు ప్రాంత బాధితులు

**హైదరాబాద్, ఫిబ్రవరి 20 (ప్రభాత ఉదయం):** హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లోని చెరువులు, కుంటలు, ప్రభుత్వ స్థలాల పరిరక్షణ కోసం ఏర్పాటు చేసిన హైడ్రాను మరింత పటిష్టం చేయాలని పలువురు భూ కబ్జాదారుల బాధితులు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఎన్నో సంవత్సరాలుగా కబ్జాదారుల నుంచి ఎదుర్కొంటున్న సమస్యలకు హైడ్రా పరిష్కారం చూపుతోందన్నారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో నగరం, శివారు ప్రాంతాలకు చెందిన బాధితులు నాగేశ్వరరావు, సాయికుమార్, చంద్రశేఖర్, తనూజ, శ్రీనాథ్, గాయత్రి, నవీన్ కుమార్ మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం హైడ్రా వంటి మంచి వ్యవస్థను ఏర్పాటు చేసిందని, కబ్జాదారుల బారి నుంచి తమను రక్షిస్తుందని చెప్పారు. కొంత మంది కబ్జాదారులు హైడ్రాపై ఉద్దేశపూర్వకంగా తప్పుడు ప్రచారం చేయిస్తున్నారని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. గతంలో ఎన్నడూ లేనివిధంగా హైడ్రా ప్రభుత్వ స్థలాల పరిరక్షణకు ప్రత్యేక కార్యాచరణతో ముందుకు సాగుతుందని చెప్పారు. పార్కులు,

..మిగతా 2లో

## బీఆర్ఎస్ అండతోనే
# ఏపీ జలదోపిడీ

### కృష్ణా జలాల్లో 200 టిఎంసిలు చాలన్న ఘనులు
### శ్రీశైలం, సాగర్‌లను ఎపికి అప్పగించి చోద్యం చూశారు
### నీటిపారుదల రంగాన్నిసర్వనాశనం చేశారు
### బిఆర్ఎస్ ప్రభుత్వ నిర్వాకంపై మండిపడ్డ ఉత్తమ్ కుమార్



**హైదరాబాద్, ఫిబ్రవరి 20 (ప్రభాత ఉదయం):** ఏపీ ప్రభుత్వం చేస్తున్న జలదోపిడీకి భారాస ప్రభుత్వం సహకరించిందని తెలంగాణ నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఆరోపించారు. సచివాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. కృష్ణా జలాల్లో తెలంగాణకు కేవలం 200 టీఎంసీలు సరిపోతాయని

..మిగతా 2లో



# కరెంట్ షాక్‌తో ముగ్గురి మృతి

**నిజామాబాద్, ఫిబ్రవరి 20 (ప్రభాత ఉదయం):** జిల్లాలోని బోధన్ మండలం పెగడపల్లి గ్రామ శివారులో కరెంట్ షాక్‌తో ముగ్గురు మృతి చెందడంతో గ్రామంలో విషాదం నెలకొంది. పందుల వేటకు వెళ్లగా ప్రమాదవశాత్తు కరెంట్ షాక్ తగిలి మృతి చెంది ఉంటారని పోలీసులు అనుమానిస్తున్నారు. మృతులు రెంజల్ మండలం సాటాపూర్ గ్రామానికి చెందిన ఒకే కుటుంబానికి చెందిన ఓర్సు గంగారం, బాలమణి, కిషన్ గా గుర్తించారు. ఈ ఘటనపై పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది. కేసు నమోదు చేసి పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

# రాజలింగమూర్తి హత్య కేసుపై ఫాస్ట్రాక్ కోర్టులో విచారిస్తాం

### దీని వెనుక బీఆర్ఎస్ నేతలు కేటీఆర్, హరీశ్‌రావుల హస్తం
### హత్య రాజకీయాలను ప్రోత్సహిస్తున్న బీఆర్ఎస్: మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

**హైదరాబాద్, ఫిబ్రవరి 20 (ప్రభాత ఉదయం):** సామాజిక కార్యకర్త రాజలింగమూర్తి హత్యపై సీబీసీఐడీతో విచారిస్తామని మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి స్పష్టం చేశారు. ఈ హత్యపై పోలీసుల విచారణ జరుగుతోందని.. దోషులను 24 గంటల్లోనే పట్టుకుంటామని తెలిపారు. రాజలింగమూర్తి కేసును ఫాస్టాక్ కోర్టులో విచారణ జరిపిస్తామని చెప్పారు. రాజలింగమూర్తిని గండ్ర వెంకట రమణా రెడ్డి హత్య చేయించారని

..మిగతా 2లో





## ఎమ్మెల్సీ ఎన్నికల్లో బిజెపితో
# బిఆర్ఎస్ కుమ్మక్కు

### అందుకే అభ్యర్థులను పోటీలో పెట్టలేదు: శ్రీధర్ బాబు

హైదరాబాద్, ఫిబ్రవరి 20 (ప్రభాత ఉదయం): ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థినిలబెట్టకుండా ప్రత్యక్షంగా, పరోక్షంగా బిజెపీకి మద్దతు ఇస్తుందని మంత్రి శ్రీధర్ బాబు అన్నారు. కాంగ్రెస్ పార్టీ ప్రధాన ప్రతిపక్షం బీఆర్ఎస్.. తాము బీఆర్ఎస్ తో ఎలా నడుస్తామన్నారు. బీజేపి, బీఆర్ఎస్ లు కలిసి నడుస్తున్నాయని చెప్పారు. పట్టభద్రుల ఎన్నికలలో ఖచ్చితంగా విజయం సాధిస్తామన్నారు.. బీఆర్ఎస్ ఎన్ని ప్రయత్నాలు చేసినా కాంగ్రెస్ ప్రభుత్వానికి ఏమీ కాదన్నారు మంత్రి శ్రీధర్ బాబు. కాంగ్రెస్ గ్రాఫ్ ఎక్కడా పడిపోలేదు... ఐదేండ్లు తమ ప్రభుత్వానికి ఢోకాలేదన్నారు. పది సంవత్సరాల్లో బీఆర్ఎస్ చేసిన అవినీతిని పకడ్బందీగా బయటికి తీస్తున్నామని చెప్పారు. వామన్ రావు దంపతుల హత్యకేసు సుప్రీంకోర్టులో విచారణ జరుగుతోందన్నారు.హత్య రాజకీయాలను క్షమించేది లేదని.. భూపాలపల్లి హత్య విషయంలో ప్రభుత్వం సీరియస్ గా ఉందన్నారు. ఖచ్చితంగా తప్పు చేసినవారికి శిక్ష పడుతుందన్నారు. నరేందర్ రెడ్డిపై బీజేపీ నాయకులు దుష్ప్రచారం చేస్తున్నారని చెప్పారు శ్రీధర్ బాబు. నరేందర్ రెడ్డి ఎన్నిక కాదు ఇది....కాంగ్రెస్ పార్టీ ఎన్నిక అని అన్నారు. 317 జీవో బీఆర్ఎస్ తీసుకొస్తే బీజేపి మద్దతు తెలిపిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రాగానే 317 జీవో ద్వారా అన్యాయం జరిగిన వారికి వెసులుబాటు కల్పించామన్నారు. 317 జీవో గురించి మాట్లాడే హక్కు బండి సంజయ్ కి లేదన్నారు.

## హైడ్రాను మరింత
# పటిష్టం చేయాలి

మొదటి పేజీ తరువాయి...

చెరువులు, ప్రభుత్వ స్థలాను కబ్జా చేస్తున్న వారిపై ఫిర్యాదు చేసిన బాధితులపై కక్షపూరిత కేసులు నమోదు చేస్తున్నారని, సీఎం స్పందించి బాధితులకు అండగా నిలవాలని కోరారు. ఈ మేరకు తమకు హైడ్రా చేసిన మేలును, కబ్జాదారులు వేధిస్తున్న వివరాలను పలువురు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో దివ్యనగర్, కోహెడ, అమీన్‌పూర్, నాగిరెడ్డి చెరువు, ముత్తంగి, బడంగ్ పేట్ తదితర ప్రాంతాల్లో హైడ్రా వల్ల లబ్ధిపొందిన వారు పాల్గొన్నారు.

## రాజలింగమూర్తి హత్య కేసుపై
# ఫాస్ట్రాక్ కోర్టులో విచారిస్తాం

మొదటి పేజీ తరువాయి...

ఆరోపించారు. దీని వెనక కేసీఆర్, కేటీఆర్, హరీష్ ఉన్నారని ఆరోపించారు. 'మీరు తెలంగాణలో ఎలా పుట్టారో అర్థం కావడం లేదని ఆక్రోశం వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ హత్యా రాజకీయాలను ప్రోత్సహిస్తోందని దుయ్యబట్టారు. హత్యా రాజకీయాలు తెలంగాణ సంస్కృతి కాదు. బీఆర్ఎస్ నేతలు హత్యా రాజకీయాలను మానుకోవాలని హితవు పలికారు. దోపిడీని ప్రశ్నిస్తే హత్య చేసే స్థాయికి దిగజారారని తెలిపారు. సామాజిక కార్యకర్త రాజలింగమూర్తి హత్యను ఖండిస్తున్నాను" అని అన్నారు. మేడిగడ్డ అక్రమాలపై రాజలింగమూర్తి కోర్టులో పోరాడుతున్నాడని తెలిపారు. నీళ్లు పోసుకుని పెట్రోల్ అని చెప్పి అమాయకులు చనిపోవడానికి హరీష్ కారణం అయ్యారని దుయ్యబట్టారు. దోపిడీ బయట పడుతుందని హత్యలు చేస్తారా అంటూ ఫైర్ అయ్యారు. అడ్వకేట్ వామన రావును హత్య చేసిన వాళ్ళకే కేసీఆర్ టికెట్ ఇచ్చారన్నారు. హరీష్ రావు మానవత్వం ఉన్న మనిషేనా అని ప్రశ్నించారు. రాజలింగమూర్తి హత్యను డైవర్ట్ చేసేందుకు హరీష్ రావు కృష్ణా నీళ్ల గురించి మాట్లాతున్నారన్నారు. "స్కాముల గురించి ప్రశ్నిస్తే చంపేస్తారా? 15 నెలల నుండి కేసీఆర్ ఈ ఎవరికైనా కనిపించాడా? కాంగ్రెస్ గ్రాఫ్ తగ్గిందని కేసీఆర్‌కు ఎలా తెలుసు? ఐదుగురు ఎమ్మెల్యేలు ఉన్నా ప్రతిపక్ష నాయకుడిగా భట్టి ఒంటరి పోరాటం చేశారు" అని మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి పేర్కొన్నారు. జయశంకర్ భూపాలపల్లి: మాజీ కౌన్సిలర్ భర్త రాజలింగమూర్తి హత్యను కాంగ్రెస్ పార్టీ తీవ్రంగా ఖండిస్తోందని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు అన్నారు. హత్యకు కారకులను వెంటనే పట్టుకోవాలని పోలీసులను ఆదేశించామని తెలిపారు.

## హత్యా రాజకీయాలు
# కాంగ్రెస్‌కే అలవాటు

### మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డికి మతి భ్రమించింది
### బీఆర్ఎస్ హత్యా రాజకీయాలను ప్రోత్సహించదు : గండ్రా వెంకటరమణారెడ్డి

హైదరాబాద్, ఫిబ్రవరి 20 (ప్రభాత ఉదయం): హత్యా రాజకీయాలు కాంగ్రెస్ పార్టీకే అలవాటు.. బీఆర్ఎస్ పార్టీ హత్యా రాజకీయాలను ప్రోత్సహించదు అని మాజీ ఎమ్మెల్యే గండ్రా వెంకటరమణారెడ్డి స్పష్టం చేశారు. మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి మతి భ్రమించి మాట్లాడుతున్నారని మండిపడ్డారు. తెలంగాణ భవన్‌లో గండ్రా వెంకటరమణారెడ్డి మీడియాతో మాట్లాడారు. భూపాలపల్లిలో రాజలింగ మూర్తి హత్యను బీఆర్ఎస్ మాజీ శాసన సభ్యుడిగా తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. హత్య తర్వాత కాంగ్రెస్ పార్టీ వాస్తవాలు తెలుసుకోకుండా మాట్లాడుతోందని అన్నారు. ఈ హత్యను బీఆర్ఎస్ పార్టీ, కేసీఆర్, హరీశ్‌రావుకు ఆపాదించాలని కాంగ్రెస్ శతవిధాల ప్రయత్నించడం దుర్మార్గమని పేర్కొన్నారు. స్థానిక భూవివాదం నేపథ్యంలో ఈ హత్య జరిగిందని ఎఫ్ఐఆర్ కూడా నమోదైందని వివరించారు. కొందరి ఒత్తిడితో రాజలింగ మూర్తి భార్య నాపై ఆరోపణలు చేస్తున్నారని అని వెంకట రమణారెడ్డి తెలిపారు. ఈ హత్యపై సీబీఐ, సీఐడీ విచారణను కాంగ్రెస్ నేతలు కోరుతున్నామన్నారు. ఎలాంటి విచారణ చేసుకున్నా మాకు అభ్యంతరం లేదని తేల్చిచెప్పారు. మేడిగడ్డపై రాజలింగమూర్తి కోర్టులో కేసు వేశారని.. దాన్ని న్యాయపరంగా ఎదుర్కొంటున్నామని తెలిపారు. మృతుడిపై భూ వివాదాల ఆరోపణలు ఉన్నాయి.. రౌడీ షీట్ కూడా ఉందన్నారు. బీఆర్ఎస్‌పై, నాపై ఆరోపణలు చేయడం ద్వారా విచారణను ప్రభావితం చేయడానికి కాంగ్రెస్ నేతలు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. హత్యలో అరెస్టయిన వ్యక్తుల పేర్లతో రాజలింగ మూర్తి పోలీసులకు ఫిర్యాదు కూడా చేశారన్నారు. మంత్రి కోమటిరెడ్డి వెంకట రెడ్డికి మతి భ్రమించిందని తెలిపారు. బట్ట గాల్చి మీద వేసే ప్రయత్నం చేస్తున్నారని.. అని మాజీ ఎమ్మెల్యే ధ్వజమెత్తారు. హత్యా రాజకీయాలు కాంగ్రెస్ పార్టీకి అలవాటు.. బీఆర్ఎస్ హత్యారాజకీయాలను ప్రోత్సహించదు. నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశంపై కూడా కోమటిరెడ్డి నల్లగొండ మున్సిపల్ చైర్మన్‌ను హత్య చేశారని ఆరోపించారు. వేముల వీరేశం ఇప్పుడు కాంగ్రెస్ పార్టీలోనే ఉన్నారు. కోమటిరెడ్డి పూటకో మాట మాట్లాడతారు.. ఆయన నోటికి మొక్కాలి. పోలీసులు నిష్పాక్షిక విచారణ జరిపి దోషులకు కఠిన శిక్షలు పడేలా చేయాలని ఆయన కోరారు.

## బీఆర్ఎస్ అండతోనే
# ఏపీ జలదోపిడీ

మొదటి పేజీ తరువాయి...

చెప్పిన ఘనత భారాసదని విమర్శించారు. నీటి పారుదల రంగాన్ని పూర్తిగా నాశనం చేసిన ఘనత బీఆర్ఎస్ దేనని కమిషన్ల కక్కుర్తితో అధిక వడ్డీకి వేల కోట్లు అప్పులు తెచ్చారని ఆరోపించారు. అప్పుల నుంచి బయటపడేందుకు తాము ప్రయత్నిస్తుంటే..బీఆర్ఎస్ నేతలు అడ్డగోలుగా మాట్లాడుతున్నారని విమర్శించారు. ఎస్ఎల్ బీసీ టన్నెల్ ను పదేళ్లు పూర్తిగా పడుకోబెట్టారని ఆరోపించారు. లక్షా 85 వేలకోట్లు ఖర్చు చేసి ఎకరాకు నీళ్లివ్వలేదన్నారు ఉత్తమ్. సగం పూర్తయిన ప్రాజెక్టులను కేసీఆర్ పట్టించుకోలేదు.. విభజన చట్టం అమలు కోసం కేసీఆర్ ఎలాంటి ప్రయత్నం చేయలేదన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే తెలంగాణకే 500 టీఎంసీలు కావాలని వాదన ప్రారంభించామన్నారు. పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టు పూర్తి చేసి ఉంటే మహబూబ్‌నగర్ జిల్లా అద్భుతంగా ఉండేదన్నారు. భారాస ప్రభుత్వం వల్లే తెలంగాణకు అన్యాయం జరిగిందన్నారు. జగన్‌తో స్నేహంగా ఉంటూ.. ఏపీ జలదోపిడీకి భారాస సహకరించిందన్నారు. జగన్ పోతిరెడ్డిపాడు సామర్థ్యం పెంచుతున్నా, అక్రమంగా ముచ్చుమర్రి నిర్మిస్తున్నా కేసీఆర్ నోరెత్తలేదని మండిపడ్డారు.కాళేశ్వరం ప్రాజెక్టుతో నీళ్లు రాలేదు కానీ.. భారాస నేత జేబులు నిండాయి. కాళేశ్వరంపై రూ.లక్షా 30వేల కోట్లు ఖర్చు చేస్తే మేడిగడ్డ కూలిపోయింది. కాళేశ్వరం ప్రాజెక్టు అప్పు తెలంగాణ ప్రజలు ఎన్నటికీ తీర్చలేనంత భారంగా మారింది. పదేళ్లు అధికారంలో ఉన్న భారాస ప్రభుత్వం కనీసం టెలిమెట్రీలు కూడా ఏర్పాటు చేయలేదు. కృష్ణా జలాలను జగన్ ప్రభుత్వం బేసిన్ అవతలకు తరలిస్తుంటే పట్టించు కోలేదు. కృష్ణా జలాల్లో 299 టీఎంసీలు మన హక్కు అయితే 190 టీఎంసీల కంటే ఎక్కువగా ఎప్పుడూ వాడలేదు. కృష్ణా బేసిన్‌లో ఆన్‌గోయింగ్ ప్రాజెక్టులు పూర్తి చేసి ఉంటే మన వాటా పూర్తిగా వాడుకునేవాళ్లం. ఏదుల, డిండి ప్రాజెక్టులను కూడా పదేళ్లలో పూర్తి చేయలేదని ఉత్తమ్ విమర్శించారు. ఈక్రమంలోనే శ్రీశైలం ప్రాజెక్టును ఏపీకి అప్పగిస్తామని 2021-22లో బీఆర్ఎస్ ఒప్పుకుందని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఆరోపించారు. నాగార్జున సాగర్ శ్రీశైలం ప్రాజెక్టుల్ని బోర్డుకు అప్పగిస్తామని 2021లో బీఆర్ఎస్ ఒప్పుకుందన్నారు. 2023 నవంబర్ లో సాగర్ ను ఏపీ ఆక్రమించింది.. ఏపీ ఆక్రమణ తర్వాతే సాగర్ సీఆర్పీఎఫ్ ఆధీనంలోకి వెళ్లిందన్నారు. ఉమ్మడి ఏపీలో శ్రీశైలం నుంచి రోజు 4.2 టీఎంసీలు తీసుకెళ్లారని చెప్పారు ఉత్తమ్. రాష్ట్రం వచ్చాక బీఆర్ఎస్ హయాంలో రోజు 9.6 టీఎంసీలు దోచుకెళ్లారని ఆరోపించారు ఉత్తమ్. కృష్ణా నీళ్లను ఏపీకి దోచి పెట్టినందుకే గత ఎన్నికల్లో బీఆర్ఎస్ ను ఓడించారని విమర్శించారు. హరీశ్ రావు ఇరిగేషన్ మినిస్టర్ గా కాదు..అసలు దేనికి పనికి రాదన్నారు. తెలంగాణ ప్రజలు, రైతుల ప్రయోజనాలు కాపాడుతామని వ్యాఖ్యానించారు.ఏపీ నీళ్ల దోపిడికి పదేళ్ల బీఆర్ఎస్ ప్రభుత్వం సహకరించిందని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఆరోపించారు . జగన్ దోస్తీ కోసం రాయలసీమ లిఫ్ట్, పోతిరెడ్డిపాడు వదిలేశారని చెప్పారు. పదేళ్లలో శ్రీశైలం నుంచి ఔట్ సైడ్ బేసిన్ 1200 టీఎంసీలు తరలించారని వ్యాఖ్యానించారు. తెలంగాణకు 550 టీఎంసీలు రావాల్సి ఉన్నా.. 298 టీఎంసీలు సరిపోతాయని చెప్పిన ఘనత కేసీఆర్ దేనని విమర్శించారు. కేసీఆర్ అసమర్థత,చేతగాని తనం వల్లే పాలమూరుకు నీటి కష్టాలు వచ్చాయన్నారు. పదేళ్లు అధికారంలో ఉన్న బీఆర్ఎస్ కనీసం టెలిమెట్రీ పరికరాలు కూడా పెట్టలేదని విమర్శించారు. కేసీఆర్ పదేళ్లు పాలమూరు ప్రాజెక్టులను పట్టించుకోలేదని విమర్శించారు. మేడిగడ్డ కూలితే ఒక్క పిల్లరే కూలిందని వాదిస్తున్నారు. వాళ్లే కట్టారు..వాళ్లే దోచుకున్నారు..వాళ్లే కూలగొట్టారు. కాళేశ్వరం అప్పులు తెలంగాణ ప్రజలకు ఎప్పటికీ భారమే. పాలమూరుకు వేల కోట్లు ఖర్చు చేసి ఒక్క ఎకరాకు నిళ్లివ్వలే. నీళ్ల కోసం కాదు బీఆర్ఎస్ నేతలు జేబులు నింపేందుకు కట్టారు. కృష్ణా నీళ్లలో ఏపీ దోపిడిని కేంద్రానికి వివరించాం.. కృష్ణా జలాల వాటా విషయంలో తెలంగాణకు అన్యాయం జరుగుతోంది. ఏపీ నీళ్ల దోపడిలో కేంద్రం జోక్యం చేసుకోవాలని ఉత్తమ్ అన్నారు.

## కాళేశ్వరం కమిషన్ విచారణ గడువు
# 2 నెలలు పొడిగింపు



హైదరాబాద్, ఫిబ్రవరి 20 (ప్రభాత ఉదయం): కాళేశ్వరం ప్రాజెక్టుపై విచారణ జరుపుతున్న విచారణ కమిషన్ గడువును ప్రభుత్వం పొడిగించింది. మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీలపై జరుగుతున్న విచారణ గడువును తెలంగాణ ప్రభుత్వం పొడిగించింది. జస్టిస్ పినాకి చంద్రఘోష్ కమిషన్ గడువును మరో 2 నెలల పాటు పొడిగిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఏప్రిల్ 30వ తేదీ వరకు కమిషన్ గడువు పొడిగిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. గతేడాది మార్చిలో ప్రభుత్వం కమిషన్‌ను ఏర్పాటు చేయగా ఏప్రిల్ నుంచి విచారణ పక్రియ ప్రారంభించింది.ఇప్పటికే నీటిపారుదల శాఖ ఈఎన్‌సీలు, మాజీ ఈఎన్‌సీలతో పాటు చీఫ్ ఇంజనీర్లు, ఎస్ఈలకు క్రాస్ ఎగ్జామినేషన్ నిర్వహించిన కమిషన్.. ఇక నీటిపారుదల శాఖ కార్యదర్శులుగా, ఇతర హోదాల్లో పనిచేసిన ప్రస్తుత, మాజీ ఐఏఎస్‌లను విచారించి బ్యారేజీల నిర్మాణంలో కీలక నిర్ణయాలు ఎవరు తీసుకున్నారన్న అంశంపై సాక్ష్యాలను సేకరించేందుకు సన్నద్ధమైంది.



జిల్లా కలెక్టర్ కార్యాలయంలో బీసీ వెల్ఫేర్ అధికారి పై ఫిర్యాదు చేస్తున్న యుగంధర్ గౌడ్

## బీసీ సంక్షేమ శాఖ జిల్లా అధికారిని
# వెంటనే సస్పెండ్ చేయాలి

### బీసీ పొలిటికల్ జెఎసి స్టేట్ చైర్మన్ రాచాల యుగంధర్ గౌడ్
### కమిషనర్ అనుమతి లేకుండా ప్రభుత్వ నిధులను కాజేసిన ఘనాపాటి
### పిల్లల పైసలు సైతం పీక్కుతింటున్న పిశాచి
### రేపటిలోగా సస్పెండ్ చేయకుంటే ఆందోళనలు ఉధృతం చేస్తాం

వనపర్తి జిల్లా ప్రతినిధి, ఫిబ్రవరి 20(ప్రభాత ఉదయం) అనేక అవినీతి అక్రమాలకు పాల్పడటమే కాకుండా ప్రభుత్వ నిధులను కాజేసిన వనపర్తి జిల్లా బిసి సంక్షేమ శాఖ అధికారి బీరం సుబ్బారెడ్డిని వెంటనే సస్పెండ్ చేయాలని బీసీ పొలిటికల్ జెఎసి స్టేట్ చైర్మన్ రాచాల యుగంధర్ గౌడ్ డిమాండ్ చేశారు.ఈమేరకు గురువారం వనపర్తి జిల్లా అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు ని కలిసి ఆధారాలతో సహా ఫిర్యాదు చేశారు.అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ... బీసీ కార్పోరేషన్ కమిషనర్ అప్రూవల్ లేకుండా దాదాపు 16 లక్షల రూపాయలు తన డ్రైవర్, అటెండర్ల పేరు మీద చెక్కు రాసి డ్రా చేశారని, దీనిపై సమగ్ర విచారణ చేపట్టాలని కోరారు.బీసీ కార్పోరేషన్లో జమ అయిన నిధులు రుణాల కోసం దరఖాస్తు చేసుకున్న బీసీలకు ఇవ్వాలని, ఏదైనా ఖర్చు చేయాలంటే తప్పనిసరిగా కమిషనర్ అనుమతి ఉండాలని నిబంధనలు ఉన్నప్పటికి అవేమీ పట్టించుకోకుండా తన స్వంతానికి వాడుకున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆతనిపై అనేక ఆరోపణలు వచ్చినా అధికారులు చూసి చూడనట్లు వ్యవహరిస్తూ వచ్చారని, దీంతో ఆదికారి ఆగడాలు మరీ ఎక్కువయ్యాయని ఆందోళన వ్యక్తం చేశారు. నాగర్ కర్నూల్ జిల్లాలో పనిచేస్తున్నప్పుడు హాస్టల్ విద్యార్థులకు అన్యాయం చేశాడని ఏసీబీ అధికారులు కేసు నమోదు చేశారని, ఈ కేసు పెండింగ్ లో ఉండగా వనపర్తి జిల్లాకు అసిస్టెంట్ జిల్లా అధికారిగా బదిలీ చేయడమే కాకుండా ఇంచార్జి బీసీ వెల్ఫేర్ జిల్లా అధికారిగా మరియు ట్రైబల్ వెల్ఫేర్ ఇంచార్జ్ జిల్లా అధికారిగా నియమించడం జరిగిందన్నారు.అంతేకాకుండా డబ్బులు తీసుకుని దాదాపు ఆరుగురుకి అవుట్ సోర్సింగ్ ద్వారా ఉద్యోగాలు కల్పించాడని ఆరోపణలు ఉన్నాయన్నారు.హాస్టళ్లలో పనిచేసే ఐదుగురు ఉద్యోగులను తన స్వంత అవసరాలకు ఉపయోగించుకోవడమే గాక, ఒకరి బదులు మరొకరిని డ్యూటి చేయిస్తున్నాడన్నారు.విద్యార్థులకు ప్రభుత్వం ఇచ్చే మెస్ బిల్లులో ప్రతి విద్యార్థి నుంచి ప్రతినెల 50 రూపాయలు ఇవ్వాలని హాస్టల్ వార్డెన్లను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నాడని తమ దృష్టికి వచ్చిందన్నారు.విద్యార్థుల కడుపు కొట్టే అధికారులను ఉపేక్షించేది లేదని, జిల్లా కలెక్టర్ స్పందించి వెంటనే అతనిని సస్పెండ్ చేయాలని లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో బీసీ పొలిటికల్ జెఏసి జిల్లా అధ్యక్షులు వనం తిరుపతయ్య యాదవ్, రాష్ట్ర కార్యదర్శి వివి గౌడ్, ఆర్టీఐ విభాగం అధ్యక్షులు గుర్రం రాఘవేందర్ కొత్తకోట మండల అధ్యక్షులు అంజన్న యాదవ్, ఆత్మకూర్ మండల ప్రధాన కార్యదర్శి అక్కల మల్లేష్ గౌడ్,దేవర శివ, చెలిమిల్ల రామన్ గౌడ్, కిరణ్, వెంకట్రాములు తదితరులు పాల్గొన్నారు.

# ఎన్నిక ఏదైనా విజయం మనదే

మొదటి పేజీ తరువాయి...

మాట్లాడినట్లు తెలుస్తోంది. ఏపీలో అభివృద్ధి పనులు ఎలా జరుగుతున్నాయి.. రాజధాని అమరావతి పనులు స్థితిగతులను మోదీ అడిగి తెలుసుకున్నట్లు సమాచారం. ఏపీ అభివృద్ధికి కేంద్రం నుంచి అన్ని విధాలా తోడ్పాటు ఉంటుందని చెప్పగా.. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ధన్యవాదాలు చెప్పినట్లు సమాచారం. ఓవైపు ఏపీలో కూటమి నేతల మధ్య విబేధాలు ఉన్నాయంటూ కొద్దిరోజులుగా ప్రచారం జరుగుతోంది. ముఖ్యంగా వైసీపీ నేతలు ఈ తరహా విమర్శలు చేస్తున్నారు. ఢిల్లీ సీఎం ప్రమాణ స్వీకార కార్యక్రమం వేదికగా ఈ విమర్శలకు ప్రధాని మోదీ చెక్ పెట్టినట్లు తెలుస్తోంది. వేదికపై పవన్ కళ్యాణ్, చంద్రబాబుతో ప్రత్యేకంగా మాట్లాడారు. ఇద్దరితో చమత్కరించిన మోదీ మిగతా ఎన్డీయే నేతలతో పోలిస్తే చంద్రబాబు, పవన్ కళ్యాణ్‌కు అధిక ప్రాధాన్యత ఇచ్చారు. దీంతో కూటమి మధ్య ఎలాంటి పొరపచ్చాలు లేవనే విషయం స్పష్టమైంది.

## ఎస్సీ వర్గీకరణలో
# మోడీ, రేవంత్ పాత్ర ఏమీ లేదు

### సుప్రీం తీర్పుతోనే దళితులకు బాసట
### ఎమ్మెల్సీ కవిత వెల్లడి



హైదరాబాద్, ఫిబ్రవరి 20 (ప్రభాత ఉదయం): సుప్రీం కోర్టు తీర్పు వల్లే ఎస్సీ వర్గీకరణకు బాటలు పడ్డాయని, ఈ విషయంలో ప్రధాని నరేంద్ర మోదీ, సీఎం రేవంత్ రెడ్డి చేసిందేమీ లేదని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత పేర్కొన్నారు. ఎమ్మెల్సీ కవిత నివాసంలో దళితబంధు సాధన సమితి సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కవిత కీలక వ్యాఖ్యలు చేశారు. ఎస్సీ వర్గీకరణలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాత్ర ఏమీ లేదు. షమీమ్ అక్తర్ కమిషన్ నివేదికను బయటపెట్టి.. వెంటనే వర్గీకరణ చేయాలి. దళితుల మధ్య పంచాయితీ పెట్టవద్దు? ఎవరికీ అన్యాయం జరగకుండా వర్గీకరణ ఉండాలి. ఎస్సీ వర్గీకరణ పేరు చెప్పి సీఎం రేవంత్ రెడ్డి మరో మోసం చేశారు. వర్గీకరణకు, ఉద్యోగాల కల్పనకు ముఖ్యమంత్రి లింక్ పెడుతున్నారు. వర్గీకరణ వంకతో జాబ్ క్యాలెండర్ అమలును నిలిపివేయవద్దు. కోర్టు తీర్పు వచ్చి 6 నెలలు గడిచినా ఆలూలేదు చూలు లేదన్నట్లుగా ఉందని కవిత విమర్శించారు. రేవంత్ రెడ్డి మాటలు చెబితే నమ్మరని ఢిల్లీ నుంచి ప్రియాంగా గాంధీని తీసుకొచ్చి హామీ ఇప్పించారు. దళిత కుటుంబాలకు రూ. 10 లక్షలకు బదులు 12 లక్షలు ఇస్తామని హామీ ఇచ్చి మోసం చేశారు. ముఖ్యమంత్రికి ప్రభుత్వాన్ని నడపడం చేతకావడం లేదు. సీఎం రేవంత్ రెడ్డి రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా చేశారు. రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను సీఎం రేవంత్ రెడ్డి కుదేలు చేశారు. ఇప్పటికే కేసీఆర్ మంజూరు చేసిన దళిత బంధు నిధులను విడుదల చేయాలి. ధైర్యం ఉంటే 18 వేల దళిత కుటుంబాలకు దళిత బంధు డబ్బులను డిమాండ్ చేయాలి. బ్జడెట్ ప్రవేశపెట్టే ముందే ఈ డబ్బులు విడుదల చేయాలి. ఎస్సీలకు బ్జడెట్‌లో 33 వేల కోట్లు కేటాయించి? కేవలం 9800 కోట్లే ఖర్చు చేశారని కవిత తెలిపారు. రేవంత్ రెడ్డిది మనసున్న ప్రభుత్వం కాదు.. మానవత్వం కూడా లేదు. రేవంత్ రెడ్డి ఆలోచన చిన్నది.. చూపు పెద్దవాళ్లపైనే ఉంది. అందుకే 125 అడుగుల అంబేద్కర్ విగ్రహానికి పూలదండ కూడా వేయలేదు. అంబేద్కర్‌ను, ఆయన వారసులను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అవమానిస్తున్నారు. అంబేద్కర్ జయంతిలోపు 125 అడుగుల అంబేద్కర్ విగ్రహానికి కేబినెట్ మొత్తం వెళ్లి పూలదండలు వేయాలి. లేదంటే ప్రభుత్వం మూసివేసిన గేట్లను బద్దలుకొట్టి మేమే అంబేద్కర్‌ను గౌరవించుకుంటాం. అంబేద్కర్‌ని గౌరవించని ముఖ్యమంత్రి మన ఆకలిని అర్థం చేసుకుంటారా..? అని కవిత ప్రశ్నించారు. అట్టడుగు వర్గాల వారిని వేలు పట్టుకొని ముందుకు నడిపించాలన్నది కేసీఆర్ ఆలోచన. పేదలు, అణగారిన వర్గాల కోసం పనిచేయాలని కేసీఆర్ ఎప్పుడూ అంటున్నారు. దళితులను ధనవంతులను చేయాలన్న ఉద్దేశంతో దళిత బంధును ప్రవేశపెట్టారు. ఎన్నికల కోసం? రానున్న తరాల కోసం కేసీఆర్ ఆలోచిస్తారు. అన్ని వర్గాలకు ఆత్మబంధువు అంబేద్కర్. అంబేద్కర్ రాసిన రాజ్యాంగం వల్లనే ప్రత్యేక తెలంగాణ సాధ్యమైంది. అంబేద్కర్‌పై ప్రేమను ప్రదర్శించడానికి 125 అడుగుల విగ్రహాన్ని ఏర్పాటు చేశారు అని కవిత పేర్కొన్నారు.

# బండ్లగూడ పీరం చెరువులోని ఇమ్మానుయేల్ చర్చిలో ఘనంగా పాస్టరమ్మల సమావేశం


బైబిల్ సందేశాలను వివరిస్తున్న పాస్టర్ సువార్తమ్మ..


ఆరాధనలో నడిపిస్తున్న పాస్టర్ లీనా దేవదాస్, పాస్టర్ లిల్లీ గ్రేస్ తదితరులు


పాటలు పాడుతున్న పాస్టరమ్మలు



ప్రార్థన సమావేశాలకు హాజరైనా పాస్టరమ్మలు

బుద్వేల్, ఫిబ్రవరి 20(ప్రభాత ఉదయం): యేసయ్య చూపిన ప్రేమను ప్రజలకు తెలియజేసి వారు సన్మార్గంలో నడుచుకునే విధంగా క్రైస్తవ ఆధ్యాత్మిక జీవితంలో జీవిస్తున్న పాస్టరమ్మలు కృషి చేయాలని మణికొండ కు చెందిన పాస్టరమ్మ సువార్తమ్మ తెలిపారు. గురువారం బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని పీరంచెరువు లో గల ఇమ్మానుయేల్ చర్చిలో రాజేంద్రనగర్ పాస్టరమ్మ ల ఫెలోషిప్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో మణికొండ కు చెందిన పాస్టర్ సువార్తమ్మ బైబిల్ సందేశాలను అందజేశారు. యిర్మియా గ్రంథం 4 అధ్యాయం 3 నుంచి 8 వచనాలలో ఉ న్న వాక్య సారాంశాన్ని వివరించారు. యూదా వారికిని యేరుషలేము నివాసులకు యెహోవా ఇలాగు సెలవిచ్చుచున్నాడు - ముళ్ళ పొదలలో విత్తనములు చల్లక మీ బీడు పొలమును దున్నుడి .! అవిధేయులైయుండట మానుకొని మీ దుష్ట క్రియలను బట్టి ఎవడును ఆర్పి వేయలేనంతగా నా ఉగ్రత అగ్ని వలే కాల్చకుండునట్లు యూదా వార లారా యేరుషలేము నివాసులారా, యెహోవాకు లోబడియుండిడి.! యూదాలో సమాచారము ప్రకటించుడి, యెరూషలేములో చాటించుడి, దేశంలో బూర ఊదుడి, గట్టిగా హెచ్చరిక చేయుడి, ఎట్లనగా - ప్రాకారము గల పట్టణంలోనికి పోవునట్లుగా పోగై రండి.! సీయోను చూచునట్లు ధ్వజము ఎత్తుడిబీ పారిపోయి తప్పించుకొనుటకు ఆలస్యము చేయకూడని చెప్పుడి బీ యెహోవానగు నేను ఉత్తర దిక్కు నుండి కీడును రప్పించుచున్నాను, గొప్ప నాశనమును రప్పించుచున్నాను.! పొదలలో నుండి సింహము బయలుదేరి యున్నదిబీ జనముల వినాశకుడు బయలుదేరి యున్నాడు, నీ దేశమును నాశనము చేయుటకు అతడు ప్రయాణమై తన నివాసము విడిచి యున్నాడు, నీ పట్టణములు పాడై నిర్జనముగా నుండును.! ఇందుకై గోనె పట్ట కట్టుకొనిడి బీ రోదనము చేయుడి, కేకలు వేయుడి, యెహోవా కోపాగ్ని మన మీదికి రాకుండా మానిపోలేదు బీ! ఇదే యెహోవా వాక్కు అనే అంశంపై బైబిల్ సందేశాలను అందజేశారు. పాస్టరమ్మ ల సమావేశానికి అధ్యక్షురాలిగా పాస్టర్ ఫిబే వ్యవహరించారు. పాస్టర్ హెప్సిబా సాక్ష్యం చెప్పి దేవుని మహిమ పరిచారు. పాస్టర్ లీనా దేవ దాస్, పాస్టర్ లిల్లి గ్రేస్ ఆరాధన లో నడిపించారు. పాస్టరమ్మల ఫెలోషిప్ నివేధిక ను, వీడియో ప్రదర్శన ను పాస్టర్ స్వర్ణ రాజారామ్ ప్రదర్శించారు. సమావేశంలో పాస్టరమ్మల ఫెలోషిప్ అధ్యక్షురాలు పాస్టర్ పి అనురాధ పాల్గొన్నారు. వందన సమర్పణ రెవరెండ్ నెలటూరి రాజారామ్ చేయగా, ముగింపు ప్రార్థన రెవరెండ్ జే పీ పాల్ చేసారు. ప్రార్థన సమావేశంలో పాల్గొన్న పాస్టరమ్మలకు ఇమ్మాయేల్ చర్చ్ తరపున సన్మానం చేశారు.



## నేడు కిస్మత్ పూర్, హిమాయత్ సాగర్‌లలో విద్యుత్ సరఫరాలో అంతరాయం

బండ్లగూడ, ఫిబ్రవరి 20(ప్రభాత ఉదయం) కిస్మత్ పూర్ విద్యుత్ సెక్షన్ పరిధిలో డాన్ బోస్కో విద్యుత్ ఫీడర్ పరిధిలో శుక్రవారం ఉదయం 11 గంటల నుండి మధ్యాహ్నం 1:00 వరకు మేడ్చల్ కాలనీ, వినాయక నగర్, డిడి కాలనీ, కాళీ మందిర్, ఎన్ ఎఫ్ సి కాలనీ, ఆదర్శనగర్, ఎక్సైజ్ అకాడమీ, అభ్యుదయ నగర్, అరుణోదయ నగర్, సంధ్యా నగర్, జి ఆర్ నగర్ ,మాచన్పల్లి ఎంక్లేవ్, బండ్లగూడ విద్యుత్ ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం రెండున్నర నుండి సాయంత్రం 4:30 వరకు ఆరే మైసమ్మ ప్రధాన రహదారి, కాళికా నగర్, ఎన్ ఎఫ్ సి కాలనీ, మల్లికార్జున నగర్, ఆదర్శనగర్ రోడ్ నెంబర్ 1, 5, న్యూ కేర్ హాస్పిటల్, గాయత్రి నగర్, వికాస్ నగర్, ద్వారకా నగర్, యాదవ మిత్ర కాలనీ, శిరిడి సాయిబాబా కాలనీ, ప్రశాంత్ కాలనీ కమ్యూనిటీ హాల్, భారతి నగర్, డిఫెన్స్ కాలనీ విద్యుత్ ఫీడర్ పరిధిలో ఉదయం 11 గంటల నుండి మధ్యాహ్నం రెండు గంటల వరకు ఆర్ వి నిర్మాణ్, ట్రంప్ విల్లా, సాయిబాబా కాలనీ, డిఫెన్స్ కాలనీ, రామ్ కి విల్లా, ఖాదర్ ఎన్ఆర్ఐ ప్రాంతాలలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు సెక్షన్ అసిస్టెంట్ ఇంజనీర్ మల్లేష్ రాజ్ తెలిపారు.

**హిమాయత్ సాగర్ సెక్షన్ లో...**

హిమాయత్ సాగర్ విద్యుత్ సెక్షన్ పరిధిలో శుక్రవారం ఉదయం 11 గంటల నుండి మధ్యాహ్నం రెండు గంటల వరకు ఆదర్శ నగర్, బుద్వేల్, చైతన్య విలాస్ చింతల్ మెట్, బీడీ కాలనీ హైట్స్, బండ్లగూడ జాగీర్ విద్యుత్ ఫీడర్ పరిధిలో గల ప్రాంతాలైన ఆదర్శ నగర్, హవాని కాలనీ, కపిల్ నగర్, పీరంచెరువు, రాజనగర్, ఎస్ ఎం ఆర్ బిల్డర్స్, శ్రీనివాస కాలనీ, మధ్యాహ్నం 2:30 నుండి 4:30 వరకు ఆదర్శనగర్, బైరాగి గూడ, బండ్లగూడ విలేజ్, బీడీ కాలనీ, హిమగిరి కాలనీ, ఇద్దరు షాకోట్, ఐ ఎల్ ఎన్ ఎస్ కాలనీ, ఖాళీకా నగర్, విద్యాపీఠం దానిలో మధ్యాహ్నం మూడు గంటల నుండి సాయంత్రం 8 గంటల వరకు విద్యుత్ సరఫరా ఇస్తున్నట్లు సెక్షన్ అసిస్టెంట్ ఇంజనీర్ అమర్ సింగ్ తెలిపారు. వినియోగదారులు ఈ అంతరాయానికి సహకరించాలని ఆయన కోరారు.



నార్సింగి మున్సిపాలిటీ ప్రత్యేక అధికారి సోలిపేట శ్రీనివాస్ రెడ్డికి పూల మొక్క అందజేస్తున్న కమిషనర్ కృష్ణమోహన్ రెడ్డి

## ప్రత్యేకాధికారిగా సోలిపేట శ్రీనివాస్ రెడ్డి

నార్సింగ్, ఫిబ్రవరి 20 (ప్రభాత ఉదయం): నార్సింగ్ మున్సిపాలిటీ కమిషనర్ టి. కృష్ణమోహన్ రెడ్డి నూతనంగా బాధ్యతలు చేపట్టిన ప్రత్యేకా ధికారి ఎస్.శ్రీనివాసరెడ్డిని గురువారం కలిశారు. ఈ సందర్భంగా నార్సింగ్ మున్సి పాలిటీలోని పార్కులు, జంక్ష న్లు, రోడ్ల అభివృద్ధి పనుల పై చర్చించారు. ప్రజా సమ స్యలపై ప్రత్యేకాధికారి శ్రీనివాసడ్డికి టి.కృష్ణమోహన్ రెడ్డి వివరించారు. కిందిస్థాయి అధికారు లతో కాలనీలు, బస్తీల్లో తిరుగుతూ ప్రజా సమస్యలను తెలుసుకొని పరిష్కరించే దుకు కృషి చేయాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో డీఈఈ కె.నరేశ్ కుమార్, ఏఈ శ్రీనివాస్, మేనేజర్ నాగేంద్ర బాబు, మున్సిపల్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.


సెమినార్‌ను జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభిస్తున్న డాక్టర్ సుధా నారాయణన్

## జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని మరింత సమర్థవంతంగా అమలు చేయాలి

బుద్వేల్, ఫిబ్రవరి20(ప్రభాత ఉదయం): మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం(ఎస్ఆర్ఈజీఏ) ద్వారా దేశంలోని కోట్లాది మంది పేదలకు ఉపాధి అవకాశాలు లబిస్తున్నాయని ఇంటర్నేషనల్ ఫుడ్ పాలసీ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్ ( ఐఎఫ్ పీఆర్ఐ) సీనియర్ రీసెర్చ్ ఫెలో డాక్టర్ సుధా నారాయణన్ అన్నారు. రాజేంద్రనగర్ లోని జాతీయ గ్రామీణాభివృద్ధి పం చాయతీరాజ్ (ఎన్ఐఆర్డీపీఆర్) లో రెండు రోజుల పాటు ఎన్ఆర్ఈజీఏ అమలు - అవకాశాలు - సవాళ్లు అనే అంశంపై నిర్వహిస్తున్న రెండు రోజుల సెమినార్ ను గురువారం ఆమె జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. జీవనోపాదులు, వాతావరణ మార్పులకనుగుణంగా ఉపాధి అవకాశాల కల్పన. డిజిటల్ గవర్నెన్స్, స్కిల్ డెవలప్మెంట్, జెండర్ ఈక్విటీ, సస్టైనబుల్ డెవలప్మెంట్ గోల్స్ అనే అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ. మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాది హామీ పథకం గతంలో ఎంతో మందికి జీవనాన్ని ఇచ్చిందని, వర్తమానంలో కోట్లాది మందికి ఉపయోగపడుతుందని, భవిష్యత్తుకు ఎంతో అవసరమని గుర్తు చేశారు. దేశం నలుమూలల నుంచి వచ్చిన విశ్వవిద్యాలయాల ప్రొఫెసర్లు, మేదావులు, ఎన్ఆర్ఈజీఏ పథకం లో పనిచేస్తున్న ఉన్న తాధికారులు ఈ సమావేశంలో పాల్గొని 52 పేపర్లను సమర్పించారు. మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పై వస్తున్న దుస్ప్రచారాలను అరికట్టడానికి ఈ పనులను చేస్తున్న వారిలో స్కిల్ డెవలప్మెంట్ శిక్షణలను ఇచ్చి వారి ద్వారా మెరుగైన పనులను చేయించేలా చూడాలన్నారు. ఎన్ఆర్ఈ జీఏ పథకం ద్వారా దేశంలో ఎంతో భూమి సారవంతంగా మారిందని, అభివృద్ధి చెందిందని, నీటి వనరులు బాగుపడ్డాయని పలువురు మేధావులు తమ పేపర్ల సమర్పణలో తెలియజేశారు. ఈ సెమినార్లో ఎన్ఐ ఆర్ డీ పీఆర్ కు చెందిన ప్రొఫెసర్ డాక్టర్ రమీద్ర ఎస్ గవాలీ ప్రారంభోపన్యాసం చేశారు. కోర్సు డైరెక్టర్ డాక్టర్ సి.ధీరజ స్వాగతోపన్యాసం చేశారు. సెమినార్ రోడ్ మ్యాప్ గురించి తెలియజేశారు. కోర్సు విధివిధానాలతో కూడుకున్న పుస్తకాన్ని విడుదల చేశారు. ఎన్ఐ ఆర్ డీ పీఆర్ సెంటర్ ఫర్ వేజ్ ఎంప్లాయిమెంట్ అండ్ లైఫ్లీ హుడ్స్ కు చెందిన డాక్టర్ సోనాల్ మెబర్ రాయ్, డాక్టర్ దిగంబర్ ఏ చిమాంకర్ లు పాల్గొన్నారు.



## మెదక్ -నిజామాబాద్- కరీంనగర్-ఆదిలాబాద్ గ్రాడ్యుయేట్ కాంగ్రెస్ ఎమ్మెల్సీ అభ్యర్థి నరేందర్ రెడ్డికి మద్దతుగా ఎమ్మెల్యే జిఎంఆర్ బృందం ప్రచారం

కొత్తకోట, ఫిబ్రవరి 20(ప్రభాత ఉదయం) మెదక్ - నిజామాబాద్- కరీంనగర్-ఆదిలాబాద్ గ్రాడ్యుయేట్ కాంగ్రెస్ ఎమ్మెల్సీ అభ్యర్థి నరేందర్ రెడ్డికి మద్దతుగా గురువారం మెదక్ జిల్లా నర్సాపూర్ లో నర్సాపూర్ అసెంబ్లీ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ రాజిరెడ్డి ముఖ్య కాంగ్రెస్ నాయకులతో సమావేశమై, ఎమ్మెల్సీ ఎన్నికలపై దేవరకద్ర ఎమ్మెల్యే, నర్సాపూర్ అసెంబ్లీ నియోజకవర్గ ఎమ్మెల్సీ ఎన్నికల ఇంచార్జ్ జి. మధుసూదన్ రెడ్డి దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జిఎంఆర్ మాట్లాడుతూ... ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయం సాధించడం ఖాయం అన్నారు.

## స్వర్ణగోపుర కుంభాభిషేకానికి సిఎంకు ఆహ్వానం

హైదరాబాద్, ఫిబ్రవరి 20 (ప్రభాత ఉదయం): యాదాద్రిలో జరుగుతున్న శ్రీశ్రీ సుదర్శనలక్ష్మీనారసింహ దివ్యస్వర్ణ విమాన గోపురమహా కుంభాభిషేక మహోత్సవానికి సిఎం రేవంత్‌రెడ్డిని ఆహ్వానించారు. బుధవారం ఈ ఉ త్సవాలు ప్రారంభం అయ్యాయి. ఆదివారం 23న స్వర్ణగోపుర మహాకుంభాభిషేకం జరుగనుంది. జూబ్లీహిల్స్ నివాసంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ని కలిసి శ్రీశ్రీ సుదర్శనలక్ష్మీనారసింహ దివ్యస్వర్ణ విమాన గోపురమహా కుంభాభిషేక మహోత్సవానికి ఆహ్వానించారు. సిఎంను కలిసిన వారిలో మంత్రి కొండాసురేఖ, ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య, దేవాదాయశాఖ ముఖ్య కార్యదర్శి శైలజా రామయ్యర్, యాదగిరిగుట్ట ఆలయ ఈవో, ఆలయ అర్చకులు ఉన్నారు. ఈ మేరకు ఆహ్వాన పత్రం అందించారు. ఆలయ పూజారులు సిఎం రేవంత్‌కు ఆశీర్వచనం చేశారు.



## ప్రయాగ్ రాజ్‌లో పుణ్యస్నానాలు చేసిన కవగుడ గ్రామస్తులు

శంషాబాద్,ఫిబ్రవరి 20 (ప్రభాత ఉదయం) శంషాబాద్ మండలం కవ్వగూడ గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ దేవరకొండ రమేష్ యాదవ్ ఆధ్వర్యంలో గ్రామస్తులు ప్రయాగ్రాజ్ వెళ్లి కుంభమేళాలో పుణ్య స్నానాలు చేశారు. 144 సంవత్సరాల తర్వాత వచ్చిన కుంభమేళాలో పవిత్ర స్నానాలు చేయడానికి శంషాబాద్ నుండి ప్రజలు పెద్ద ఎత్తున తరలి వెళ్తున్నారు. అందులో భాగంగా కవ్వ కూడా మాజీ సర్పంచ్ దేవరకొండ రమేష్ యాదవ్ ఆధ్వర్యంలో గ్రామ ప్రముఖులు తరలి వెళ్లారు. ప్రయాగరాజులో ఉ పన్యాసారాలు చేసిన అనంతరం కాశీ విశ్వేశ్వరుని దర్శనం చేసుకున్నారు. అనంతరం అయోధ్యలో శ్రీరాముడి దర్శనం చేసుకుని తిరుగు ప్రయాణం అయ్యారు. కవ్వగూడ గ్రామస్తులు అందరూ సుఖసంతోషాలతో ఉంటూ అభివృద్ధి చెందాలని ఆశించినట్లు రమేష్ యాదవ్ తెలిపారు.

## లారీ క్రింద పడ్డ వాహనదారుడు, తీవ్ర గాయాలు


లారీ క్రింద పడ్డ యువకుడు

బుద్వేల్, ఫిబ్రవరి20(ప్రభాత ఉదయం): ఇసుక సీకుల లోడ్ తో వెళుతున్న ఓ లారీ ని వెనుక టైర్లకు యాక్టీవా ద్విచక్రవాహనంతో ఢీ కొట్టుకోవడంతో ఓ యువకుని చెయ్యి ప్యాక్చర్ అయింది. ఈ సంఘటన గురువారం బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పోరేషన్ పరధిలోని కిస్మత్పూర్ ఎర్రకుంట మార్గంలో జరిగింది. వివరాలు ఈ విదంగా ఉ న్నాయి.... ఎర్రకుంట ఖాదర్ ఎన్ఆర్ఐ కాలనీ నుంచి ఇనుప సీకులు లోడ్ తో వెళుతున్న ఏపీ29టీబీ 4342 నెంబర్ లారీని వెనుకాల నుం చి వేగంగా టీఎస్07 హెచ్ యు 5684 నెంబర్ ద్విచక్ర వాహనంపై వచ్చిన అభ్యుదయనగర్ కాలనీ కి చెందిన నరేందర్ సాయి (24) ఢీ కొట్టాడు. ఈ ప్రమాదంలో నరేందర్ సాయి చెయ్యి పై నుంచి లారీ టైర్లు పోవడంతో తీవ్ర రక్తస్రావం జరిగింది. స్థానికులు గమనించి గాయపడ్డ నరేందర్ సాయిని ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకున్న రాజేంద్రనగర్ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

**స్పీడ్ బ్రేకర్లు వేయాలి: స్థానికులు**

కిస్మత్ పూర్ నుంచి రాక్ చర్చి మీదుగా ఎర్రకుంట ఎక్సైజ్ అకాడమీ మార్గంలో రోడ్డు విశాలంగా ఉన్నందున తరచు ప్రమాదాలు జరుగుతున్నాయని స్థానికులు వాపోతున్నారు. ఈ రోడ్డులో స్పీడ్ బ్రేకర్లు వేయాలని కోరుతున్నారు.

## నార్మ్ జాయింట్ డైరెక్టర్‌గా డాక్టర్ గోపాల్ లాల్


డాక్టర్ గోపాల్ లాల్

బుద్వేల్, ఫిబ్రవరి 20(ప్రభాత ఉదయం): రాజేంద్రనగర్‌లో గల నేషనల్ అకాడమీ ఆఫ్ అగ్రికల్చరల్ రీసెర్చ్ మేనేజ్‌మెంట్ (నార్మ్) జాయింట్ డైరెక్టర్‌గా డాక్టర్ గోపాల్ లాల్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. పంటల మెరుగుదల, నిర్వహణ సమాచార వ్యవస్థలు, సూక్ష్మ నీటిపారుదల వ్యవస్థలు, విత్తనోత్పత్తి, విస్తరణ వ్యవస్థలలో అతనికి 28 సంవత్సరాలకు పైగా అపార అనుభవం ఉంది. అకాడమీలో చేరడానికి ముందు ఆయన న్యూ డిల్లీ సెంట్రల్ వాటర్ కమిషన్ కావేరి వాటర్ మేనేజ్ మెంట్ అథారిటీ సభ్యుడు (వ్యవసాయం) గా పనిచేశారు. అంతకు ముందు, డాక్టర్ గోపాల్ రాజస్థాన్ అజ్మీర్‌లోని నేషనల్ రీసెర్చ్ సెంటర్ ఆన్ సీడ్ స్పైసెస్ కి డైరెక్టర్‌గా 5 సంవత్సరాలు పని చేసారు. అదే సంస్థలో సుదీర్ఘ కాలం పాటు ప్రిన్సిపల్ సైంటిస్ట్‌గా పనిచేశారు. ఆయన రాజస్థాన్ అగ్రికల్చర్ యూనివర్సిటీ, బికనీర్‌లో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా తన వృత్తిని ప్రారంభించారు . ఆ తర్వాత ఆయన నేరుగా జోధ్‌పూర్‌లోని సెంట్రల్ ఆరిడ్ జోన్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ లో సీనియర్ సైంటిస్ట్‌గా ఎంపిక అయ్యారు. అక్కడ అతను 6 సంవత్సరాలకు పైగా పనిచేశారు. డాక్టర్ గోపాల్ లాల్ రాజస్థాన్ అగ్రికల్చరల్ యూనివర్సిటీ, బికనీర్ నుండి ఉద్యానవనంలో పీ హెచ్ డీ చేశారు. డాక్టర్ గోపాల్ లాల్ 200 పరిశోధనా పత్రాలు, 90 పుస్తక అధ్యాయాలు, 150 ప్రముఖ వ్యాసాలు, 52 సాంకేతిక నివేదికలు, బుక్‌లెట్‌లను ప్రచురించారు. 13 రకాల పంటల అభివృద్ధి పద్ధతులను అభివృద్ధి చేసి విడుదల చేయడంలో ఆయన కీలక పాత్ర పోషించారు. డాక్టర్ లాల్ ఆరు జాతీయ మరియు అంతర్జాతీయంగా ప్రసిద్ధి చెందిన వృత్తిపరమైన సంఘాలు/సంఘాలకు ఫెల్లో గా కూడా ఉన్నారు. అనేక జాతీయ అవార్డులు కూడా అందుకున్నారు.


ఆసుపత్రిలో వైద్యం కోసం ఎల్ఓసి అందజేస్తున్న ఎమ్మెల్యే జిఎంఆర్

## పేదల వైద్యం కోసం సీఎం రిలీఫ్ ఫండ్ ఎంతో దోహదం: ఎమ్మెల్యే జిఎంఆర్

దేవరకద్ర, ఫిబ్రవరి 20(ప్రభాత ఉదయం) పేదల వైద్యం కోసం సీఎం రిలీఫ్ ఫండ్ ఎంతో దోహదం చేస్తుందనిదేవరకద్ర నియోజకవర్గం ఎమ్మెల్యే జిఎంఆర్ అన్నారు. గురువారం నియోజకవర్గం పరిధిలోని చిన్న చింతకుంట మండల కేంద్రానికి చెందిన సీనియర్ కాంగ్రెస్ నాయకులు వజీర్ బాబు అల్లుడు తారిఖ్ అహ్మద్ కి వైద్యం నిమిత్తం ఎం.ఎన్.జే ఆసుపత్రికి సీఎం సహాయ నిధి ద్వారా 4 లక్షల, 50,000 వేల రూపాయల ఎల్ ఓ సి ని వారి కుటుంబ సభ్యులకు దేవరకద్ర ఎమ్మెల్యే జి. మధుసూధన్ రెడ్డి అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జిఎంఆర్ మాట్లాడుతూ... పేదలు ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు.



ఉపాధి హామీ పథకం పని వివరాలను పరిశీలిస్తున్న కలెక్టర్ సంతోష్

## ఉపాధి హామీ పథకం కింద జాబ్ కార్డ్ ఉన్న ప్రతి కుటుంబానికి పని కల్పించాలి

### కలెక్టర్ సంతోష్

### అధికారులను ఆదేశించిన కలెక్టర్ సంతోష్

గద్వాల జిల్లా ప్రతినిధి, ఫిబ్రవరి20(ప్రభాత ఉదయం) జాబ్‌కార్డులు ఉన్న ప్రతీ కుటుంబానికి ఉపాధి హామీ పథకం కింద పని కల్పించాలని జిల్లా కలెక్టర్ బి.యం. సంతోష్ అధికారులకు ఆదేశించారు. గురువారం గట్టు మండలంలోని మండల మహిళా సమాఖ్య భవనాన్ని ఆకస్మికంగా సందర్శించారు. జాబ్‌కార్డు సృష్టి, డేటా ఎంట్రీ వివరాలను, రిజిస్టర్ లను స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా సంబంధిత అధికారులతో చర్చించి, ఉపాధి హామీ పనుల అమలుపై స్పష్టమైన సూచనలు అందించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ గ్రామీణ వర్గాల అభివృద్ధికి,వారికి అవసరమైన జీవనోపాధి భద్రత, సామాజిక రక్షణ మరియు సాధికారత కల్పించడానికి మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పని చేస్తుందని తెలిపారు. వ్యవసాయ పనులు పూర్తవుతున్న నేపథ్యంలో, ఉపాధి హామీ పనుల ద్వారా మరిన్ని గ్రామీణ కుటుంబాలకు జీవనోపాధి కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. ఉపాధి హామీలో ప్రతి ఒక్కరికి పని కల్పించాలని, ప్రతి కుటుంబానికి జాబ్‌కార్డు ఉండేలా చర్యలు తీసుకుని, వారు పని కోసం డిమాండ్ చేసే విధంగా అవగాహన కల్పించాలన్నారు. ఉపాధి హామీ పనుల్లో కూలీల సంఖ్య పెరిగేలా క్షేత్రస్థాయిలో సంబంధిత శాఖల అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. ఉపాధి హామీ పనులు పారదర్శకంగా సాగేందుకు ప్రతి పనికి సంబంధించి మెజర్‌మెంట్ బుక్ పూర్తిగా స్పష్టంగా ఉండాలని, పనుల కొలతలు, వివరాలు ఖచ్చితంగా నమోదు చేయాలని పేర్కొన్నారు. అన్ని రిజిస్టర్లు నిబంధనలకు అనుగుణంగా ఉండేలా చూసుకోవాలని, ఎటువంటి అవకతవకలకు తావులేకుండా పనులను నిష్పక్షపాతంగా నిర్వహించాలని ఆదేశించారు.ఉపాధి హామీ పథకంతో క్రింద చేపడుతున్న పనుల వివరాలను అడిగి కలెక్టర్ తెలుసుకున్నార్., ఏపీవోలు,ఈసీ,ఫీల్డ్ అసిస్టెంట్లు అందుబాటులో ఉండి పనుల పురోగతిని వేగవంతం చేయాలని ఆదేశించారు.ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ నర్సింగ రావు,ఎంపీడీఓ చెన్నయ్య,ఏపీఓ స్వామి,టెక్నికల్ అసిస్టెంట్స్, ఇంజినీరింగ్ కన్సల్టెన్సీ,తదితరులు పాల్గొన్నారు.

# ఎల్ఐసిలో క్లాస్ 3,4 ఉద్యోగాలను భర్తీ చేయాలి

### ఏఐఐఈఏ సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి శ్రీకాంత మిశ్రా

హైదరాబాద్, ఫిబ్రవరి 20(ప్రభాత ఉదయం) హైదారాబాద్ డివిజన్ కార్యాలయంలో యూనియన్ అధ్యక్షులు గిరిధర్ ప్రధాన కార్యదర్శి ఎల్ మద్దిలేటి ఆధ్వర్యంలో జరిగిన సమ్మె ర్యాలీలో పాల్గొన్న ఉద్యోగులనుద్దేశించి ఏఐఐఈఏ సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి శ్రీకాంత మిశ్రా మాట్లాడుతూ... ఎల్ ఐసి లో క్లాస్-3, 4 ఉద్యోగాలకు గత కొన్ని దశాబ్దాలుగా రిక్రూట్మెంట్ చేపట్టలేదని, మరోవైపు ఏటా వేలాది ఉద్యోగులు సంస్థ నుంచి రిటైర్ అవుతుండడంతో పాలసీదారులకు అందించవలసిన సేవల విషయంలో తీవ్ర ఒత్తిడి నెలకొంటున్నదని తెలియజేశారు. తద్వారా ప్రపంచంలోనే అగ్రగామి బీమా సంస్థగా పేరొందిన ఎస్ఐసి మరింత బలోపేతం కావడానికి ఉద్యోగుల సంఖ్య తగ్గిపోవడం పెద్ద ఆటంకంగా మారిందనీ, యాజమాన్యంతోను, వారి ద్వారా ప్రభుత్వంతోను ఎన్నోసార్లు విన్నవించినప్పటికీ ఈ విషయంలో ఎటువంటి పురోగతి కనబడడం లేదన్నారు. అంతేకాక, గత రిక్రూట్ మెంట్ సందర్భంలో నింపవలసిన 2700 ఖాళీలను నేటి వరకు పూరించలేదు. ఈ సమస్య విషయంలో యాజమాన్యం యొక్క చిత్తశుద్ధిని శంకించాల్సిన పరిస్థితి ఏర్పడిందని శ్రీకాంత మిశ్రా పేర్కొన్నారు.మెజారిటీ సభ్యత్వం కలిగిన అతిపెద్ద, అతి పురాతన బీమా ఉద్యోగుల సంఘం గా ఉన్న ఏఐఐఈఏ కు గుర్తింపు ఇవ్వాలని ఎన్నో ఏళ్లుగా డిమాండ్ చేస్తున్నప్పటికీ నేటికీ అది అమలుకు నోచుకోలేదని. ఇదే రెండవ ప్రధాన డిమాండ్ అని ఆయన పేర్కొన్నారు. ప్రైవేటు కంపెనీల నుండి ఎన్నో ఒత్తిళ్లు ఉన్నప్పటికీ, ప్రభుత్వ రంగ బీమా సంస్థగా ఎల్ఐసి ముందువరుసలో నిలిపేట్లు, సంస్థ పురోగతిలో పలు సందర్భాలలో ఉద్యోగులను, మరోవైపు మార్కెటింగ్ సిబ్బందిని కదిలించే ఈ సంఘం దేశంలోనే పురోగామి సంఘంగా పేరొందిందని ఆయన తెలియజేశారు. కార్మికులు, ఉద్యోగుల సంక్షేమానికై ఎల్లవేళలా వాస్తవిక దృక్పథంతో ప్రజాస్వామ్యబద్ధంగా ముందుకు నడిచే ఈ సంఘం గుర్తింపు పొందడం ద్వారా దేశంలోని కార్మిక ఉద్యమానికి, ప్రజాస్వామ్య ఆకాంక్షలకు అద్దం పట్టినట్టు అవుతుందని ఆయన అన్నారు. ఉమ్మడి బేరసారాల హక్కుతో ఎల్లవేళలా ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లను సాధించుకోవడంతో పాటు, సంస్థలోని అనేక అంశాలను ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ, ఎల్బీసి ని దేశంలోనే అగ్రగామిగా నిలబెట్టే ఉద్యోగ సంఘం ఏఐఐఈఏ కు గుర్తింపునివ్వడం తక్షణ అవసరమని శ్రీకాంత మిశ్రా డిమాండ్ చేశారు.







# విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి: కలెక్టర్ సంతోష్



హాస్టల్లో బియ్యం నాణ్యతను పరిశీలిస్తున్న కలెక్టర్ సంతోష్



విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న కలెక్టర్ సంతోష్

గద్వాల జిల్లా ప్రతినిధి, ఫిబ్రవరి20(ప్రభాత ఉదయం) విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలని జిల్లా కలెక్టర్ బి.యం సంతోష్ అధికారులకు ఆదేశించారు. గురువారం గట్టు మండలంలోని తెలంగాణ సోషల్ వెల్ఫేర్ బాలికల రెసిడెన్షియల్ స్కూల్, కళాశాలను ఆకస్మికంగా తనిఖీ చేసి,మధ్యాహ్న భోజన నిర్వహణను పరిశీలించారు. విద్యార్థులతో కలిసి భోజనం చేసి, ఆహార నాణ్యతను స్వయంగా పరిశీలించారు. మెనూ ప్రకారం భోజనం అందుతున్నదా, రుచి ఎలా ఉన్నదాని విద్యార్థులతో మాట్లాడి వివరంగా తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ విద్యార్థులకు రోజు వడ్డిస్తున్న భోజనం,వంట సామాగ్రి, కిచెన్ షెడ్, స్టాకు గదులు,స్టోర్ రూమ్ లో నిల్వ ఉంచిన బియ్యం,రాగి, పప్పులు, షుగర్ ,బెల్లం,ఇతర సరుకుల నాణ్యతను,వాటి కాలపరిమితిని పరిశీలించారు. విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందజేస్తున్న విధానాన్ని పరిశీలించారు. ఈ రోజు మెనూ ప్రకారం ఏమి తయారు చేశారో వంట సిబ్బందిని ఆరా తీశారు. విద్యార్థులకు పోషకాహారంతో కూడిన సమతుల్యమైన భోజనం అందేలా చూసుకోవాలని, మెనూ ప్రకారం భోజనం వడ్డించడంలో ఎలాంటి లోపం లేకుండా పాఠశాల యాజమాన్యం మరియు వంట సిబ్బంది ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. వంట కోసం తాజా కూరగాయలు,నాణ్యత గల సరుకులు మాత్రమే వినియోగించాలన్నారు. వంటశాల ప్రదేశం మరియు వంట పాత్రలు ఎప్పుడూ శుభ్రంగా ఉండేలా చూడాలని సూచించారు. నాసిరకమైన బియ్యం, కూరగాయలు లేదా ఇతర ఆహార పదార్థాలు సరఫరా చేసినట్లయితే వాటిని స్వీకరించవద్దని స్పష్టం చేశారు. ఆర్.ఓ మినరల్ వాటర్ ప్లాంట్‌ను పరిశీలించి విద్యార్థులకు శుభ్రమైన తాగునీరు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శోభ రాణి,తహశీల్దార్ సలీముద్దీన్, స్పెషల్ ఆఫీసర్స్ గోవిందయ్య, షకీలా భాను, సంగీత లక్ష్మి, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న కలెక్టర్ ఆదర్శ సురభి

రికార్డులను తనిఖీ చేస్తున్న కలెక్టర్

## ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులు మంచి ఫలితాలను సాధించాలి

### వనపర్తి జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి

కొత్తకోట, ఫిబ్రవరి 20(ప్రభాత ఉదయం) పదవ తరగతి బోర్డు పరీక్షల్లో జిల్లాలోని ప్రభుత్వ విద్యాసంస్థల్లో చదివే విద్యార్థులు మంచి ఫలితాలు సాధించాలని వనపర్తి జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి అన్నారు. గురువారం కొత్తకోట మండల కేంద్రంలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ బాలికల రెసిడెన్షియల్ పాఠశాలను కలెక్టర్ అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు సంచిత్ గంగ్వార్‌తో కలిసి ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. పాఠశాలలో వంట సామాగ్రిని భద్రపరిచిన గదిని తనిఖీ చేసిన కలెక్టర్ రిజిస్టర్లను పరిశీలించారు. పాఠశాలలో తప్పకుండా మెస్ కమిటీ ఉండాలని, వంట సామాగ్రి స్టాక్ వచ్చినప్పుడు విద్యార్థుల మెస్ కమిటీ, సమక్షంలోనే దించుకోవాలని సూచించారు. స్టాక్ దించుకున్నప్పుడు రిజిస్టర్‌లో తప్పకుండా ఎంట్రీ చేయాలని చెప్పారు. మెస్ కమిటీ విద్యార్థులను పిలిచి స్టాక్ వచ్చినప్పుడు సంతకాలు చేస్తున్నారా లేదా అని తెలుసుకున్నారు. వంట సామాగ్రికి సంబంధించిన వస్తువులు ఎక్స్పైరి డేట్ తప్పనిసరిగా చెక్ చేయాలని చెప్పారు. ఈ సందర్భంగా కలెక్టర్ విద్యార్థులతో కలిసి సహపంక్తి భోజనం చేశారు.కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థులకు భోజనం వడ్డించడానికి ముందు సూపర్ వైజర్లు రుచి చూడాలని, ఆ తర్వాతే విద్యార్థులకు వడ్డించాలని సూచించారు. ఒకవేళ ఆహారం రుచికరంగా లేకపోతే తిరిగి మళ్ళీ వండి విద్యార్థులకు వడ్డించాలని చెప్పారు. విద్యార్థులకు నాణ్యమైన ఆహారాన్ని మాత్రమే అందించాలని సూచించారు. పదవ తరగతి విద్యార్థులతో కలెక్టర్ మాట్లాడుతూ ఆహారము, వసతి ఎలా ఉన్నాయని ప్రశ్నించగా బాగానే ఉన్నాయని విద్యార్థులు బదులిచ్చారు. పదో తరగతి బోర్డు పరీక్షల్లో బాగా చదివి మంచి మార్కులు సాధించాలని విద్యార్థులకు దిశానిర్దేశం చేశారు. సాంఘిక సంక్షేమ శాఖ అధికారి మల్లికార్జున్, తహసిల్దార్ వెంకటేష్, పాఠశాల ప్రిన్సిపాల్ మాధవి, తదితరులు ఉన్నారు.





మున్సిపల్ కమిషనర్ దశరథ్‌కు వినతి పత్రం అందజేస్తున్న సిఐటియు నాయకులు

## మున్సిపల్ కార్మికుల 10 నెలల పిఎఫ్, ఈయస్ఐ బకాయిలు వెంటనే విడుదల చేయాలి

### సీఐటీయూ జిల్లా అధ్యక్షులు ఏ.వెంకటస్వామి

గద్వాల జిల్లా ప్రతినిధి, ఫిబ్రవరి20(ప్రభాత ఉదయం) గద్వాల మున్సిపాలిటీలో పనిచేస్తున్న కార్మికులకు పెండింగ్లో ఉన్న పది నెలల పిఎఫ్ ,ఈయస్ఐ బకాయిలను వెంటనే విడుదల చేసి కార్మికుల ఖాతాలో జమ చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షులు ఏ.వెంకటస్వామి డిమాండ్ చేశారు. గురువారం జిల్లా కేంద్రంలోని మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ కమిషనర్ దశరథ్ ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ...జిల్లా కేంద్రంలోని మున్సిపాలిటీలో పనిచేస్తున్న కార్మికులకు గత పది నెలలుగా పిఎఫ్ ఈయస్ఐ బకాయిలు చెల్లించకుండా కాలయాపన చేస్తున్నారని అన్నారు. పిఎఫ్ నగదును ఎప్పటికప్పుడు కార్మికుల ఖాతాలో జమ చేయకపోవడం వల్ల కార్మికుల అవసరాల రీత్యా, రిటైర్మెంట్ తర్వాత గాని నగదును తీసుకునేందుకు అనేక అవాంతరాలు ఎదురవుతాయని అన్నారు. అదే విధంగా మరణించిన వారికి రిటైర్మెంట్ ఐన వారికి పెండింగ్ లో ఉన్న పిఎఫ్ నగదును వెంటనే ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్మికులకు నెలనెలా వేతనాలు ఇవ్వకుండా 3, 4 నెలలకు ఒకసారి వేతనాలు చెల్లిస్తున్నారని, కార్మికుల వేతనాలు నెలల తరబడి పెండింగ్ లో పెట్టడం వల్ల అప్పులు చేసి కుటుంబాలను పోషించుకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. వాటర్ సప్లై, ఎలక్ట్రీషియన్, కంప్యూటర్ ఆపరేటర్లకు రూ.10,000 వేతనం తక్కువగా ఇస్తున్నారని, వారికి కేటగిరీల వారీగా వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. కొంత మంది లైన్ మెన్లు ఎలక్ట్రిషన్ లపై పెత్తనాన్ని చెలాయిస్తూ పరుష పదజాలంతో దూషిస్తున్నారని విచారణ జరిపి వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా మున్సిపల్ కార్మికులకు సంవత్సరానికి రెండు జతల బట్టలు, సబ్బులు నూనెలు రహదారులను ఊడ్చే పొరకలకు సంబంధించినవి సకాలంలో ఇవ్వాలని డిమాండ్ చేశారు. సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఉప్పేర్ నరసింహ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ (సీఐటీయూ అనుబంధం)పట్టణ అధ్యక్ష కార్యదర్శులు శివ,రవి కోశాధికారి మహేష్, రఘు, సహాయ కార్యదర్శులు హనుమంతు, లలితమ్మ, కమిటీ సభ్యులు నాగమణి, వెంకటేష్, రాము పరశురాం శివకుమార్ రామేశ్వరి తదితరులు పాల్గొన్నారు.



రికార్డులను పరిశీలిస్తున్న కలెక్టర్ ఆదర్శ్ సురభి

## రైతు భూముల సమస్యలను పరిష్కరిస్తాం

### వనపర్తి జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి

కొత్తకోట, ఫిబ్రవరి 20(ప్రభాత ఉదయం): జిల్లాలోని కొత్తకోట మండల పరిధిలోని రాయినిపేట రాయసముద్రం చెరువుకు సంబంధించి అన్ని రికార్డులు పరిశీలించిన తర్వాత లోకాయుక్తకు పూర్తి నివేదిక సమర్పిస్తామని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి అన్నారు. కొత్తకోట మండల పరిధిలోని రాయినిపేట చెరువు నీటి వల్ల తమ భూములు మునుగుతున్నాయని, మునిగిన తమ భూములకు ప్రభుత్వ నష్టపరిహారం చెల్లించాలంటూ చెరువు ఆయకట్టు రైతులు ఇదివరకు లోకాయుక్తలో ఫిర్యాదు చేయడం జరిగిందని. ఈ నేపథ్యంలో లోకయుక్త కు నివేదిక సమర్పించడం కొరకు జిల్లా కలెక్టర్ గురువారం అదనపు కలెక్టర్ రెవెన్యూ జి వెంకటేశ్వర్లు, ఇరిగేషన్ సూపరిండెంట్ ఇంజనీర్ శ్రీనివాస్, ఆర్డీవో సుబ్రహ్మణ్యంతో కలిసి చెరువు పరిసరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అక్కడికి వచ్చిన రాయిని పేట, వనపర్తి మండలంలోని కడుకుంట్ల గ్రామాల రైతులతో మాట్లాడి, పరిస్థితులను తెలుసుకున్నారు. చెరువు నీటి వల్ల మునుగుతున్న తమ భూముల సమస్య గురించి రైతులు కలెక్టర్ కు వివరించారు. కలెక్టర్ మాట్లాడుతూ అన్ని రికార్డులు పరిశీలించిన అనంతరం లోకాయుక్తకు పూర్తి నివేదిక సమర్పించడం జరుగుతుందని తెలిపారు. ఇరిగేషన్ సూపరిండెంట్ ఇంజనీర్ శ్రీనివాస్, వనపర్తి తాసిల్దార్ రమేష్ రెడ్డి, కొత్తకోట తహసిల్దార్ శ్రీనివాసులు, ఇతర అధికారులు తదితరులు కలెక్టర్ వెంట ఉన్నారు.

Printed and Published **MEKALA DAMODAR REDDY** on behalf of DBC Publications, and Printed at Vanitha Graphics, H.No. 3-3-76/123/21, Maruthi Enclave, Attapur, Rajendra Nagar, Ranga Reddy, Telangana-500048. and Published at: H.No. 6-2-4/2, 1st Floor, Shivarampally , NPA, Rajendra Nagar, Ranga Reddy Telangana-500052. **Editor: MEKALA DAMODAR REDDY. "RNI. Title- Code: TELTEL12231**. Cell:9391089608